# శ్రీ సంగరామేశ్వర క్షేత్రం

మన హిందూధర్మాశయ మేమనగా సమస్త ప్రాణికోటి సుఖశాంతులతో విరాజిల్లా లన్నది. మన ధర్మమునెడ మనమెంత పూజ్యభావము గల్గి వర్తింతుమో అపుడు దేశము సుభిక్షమై వర్ధిల్లగలదు. శాస్త్రోచిత ధర్మజీవనమే మానవాభ్యుదయానికి శ్రేయస్సుకు, పరిపూర్ణశాంతికి మూల హేతువగును.

ధర్మార్థ కామ మోక్షాలనెడి చతుర్విధ పురుషార్థాలలో మొదటిదైన ధర్మమే మానవ జీవితానికి ప్రాణప్రదమైనది. ధర్మహీనమైన మానవ జీవితం నరకాన పడవేస్తుంది. ధర్మజీవనం త్యాగమయమై లోక కళ్యాణమై మోక్షాన్ని కల్గిస్తుంది. ధర్మంతో కూడిన ధనం, ధర్మంతో కూడిన కోరిక సర్వశ్రేయోదాయకమై ఇహపర సుఖాల కాలయమై శాశ్వతానందమైన ముక్తినిస్తాయి.

"ధర్మో రక్షతి రక్షితః" ధర్మాన్ని రక్షించిన వాళ్ళని ధర్మం రక్షిస్తుంది. పూర్వం దేవాలయాలు సంస్కృతికి ధర్మానికి కేంద్రస్థానాలై ప్రతిగ్రామంలో, పట్టణంలో ధర్మజ్యోతిని దేదీవ్యమానంగా వెలిగిస్తూ సమాజాన్ని తీర్చి దిద్దుతుండేవి. ఇందులో యజ్ఞయాగాదులు లలితకళలూ పోషింపబడు తుండేవి. ఇపుడు ఆ వాతావరణం విరుద్ధంగా ఉంది. ఇది దేశానికి ప్రమాదకరమైంది. ధర్మానికి, న్యాయానికి ధర్మం జరిగిననాడు దేవాలయాలు మరల ధర్మకేంద్రాలైన నాడు సంస్కృతీ స్థానాలుగా నిలబడ గల్గిననాడు మనధర్మం నిత్యకళ్యాణంగా తులతూగగలదు. అలా వాటిని నడిపించటానికి ప్రజలు, ప్రభుత్వం, అధికారులు ధనవంతులు, అర్చకులు నిస్స్వార్థ బుద్ధికల్గి సత్యవర్తనులై ముందుకురావాలి. అప్పుడే సమాజం సర్వ శుభప్రదమౌతుంది.

ఇలాంటి ఆశయసిద్ధికోసం పవిత్రమైన మూడునదుల కూడలి దగ్గర వెలసిన "శ్రీ సంగరామేశ్వర క్షేత్రం" అత్యంత ప్రామాణిక క్షేత్రాలలో ఒకటిగా వెలుగుతోంది. ఇది అనంతపురం జిల్లా ధర్మవరం తాలూ

## మన దేవాలయాలు

కాకు ఐదుమైళ్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రానికి పై పేరు రావటానికి పూర్వకాలం నుండి చరిత్రకు సంబంధించిన కొన్ని విశేషాలు తెలుస్తున్నాయి.

ఈ క్షేత్రాన్ని మొదట "సంగం" అనేవారు ఇలా అనటానికి కారణం ఇక్కడఉన్న నదుల సంగమమే. ఇచ్చట సంగమించే నదులు చిత్రావతి, దూబిలేరు, పాలేరు. వీటి మూలంగా "సంగం" అని అన్నారు. ప్రతి సంగమం దగ్గర ఈశ్వరాలయం వుండటం పరిపాటి అలాగే ఇక్కడగూడ వుంది. అంచేత దీన్ని "సంగమేశ్వరం" అన్నారు ఇలాంటివి ఉత్తర దేశంలో దేవప్రయాగ, రుద్రప్రయాగ, కర్ణప్రయాగ, నంద ప్రయాగ త్రివేణి సంగమం మొదలైనవి. ఇలాంటి వాటిని తీర్థ ప్రదేశాలుగా వ్యవహరిస్తున్నారు. తీర్థ ప్రదేశాలకు మన దేశ చరిత్రలో అత్యంత ప్రముఖ స్థానముంది.

ఈ ఈశ్వరాలయ నిర్మాణానికి కొంత చారిత్రకాధార మున్నట్లు తెలుస్తోంది. ఆలయానికి మైలుదూరంలో "అప్పరాజు చెర్వు" అనే గ్రామముంది. ఇది ధర్మవరం తాలుకాకు ఆరుమైళ్ళ దూరం. ఈ ప్రాం

